క్లుప్తంగా

అహంకారం, అవినీతికి గుణపాఠం



మాట్లాడుతున్న కృష్ణ

జూలూరుపాడు: తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కి, అహంకారం, అవినీతితో పాలన సాగించిన బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ అన్నారు. జూలూరుపాడులో సోమవారం ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి నిరంకుశ విధానాలు, నిరుద్యోగ, ఉద్యోగ సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల ఏర్పడిన వ్యతిరేక భావనే కారణమని తెలిపారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామికంగా పాలిస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు, రాయల సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఆయుర్వేద వైద్యశిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ విజయశ్రీ

ఇల్లెందురూరల్: ఇల్లెందులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, భాగ్య హెల్త్ క్లబ్ ఆధ్వర్యాన సోమవారం ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ మాట్లాడుతూ ఆయుర్వేదం అతి ప్రాచీనమైన, సనాతనమైనదని తెలిపారు. డాక్టర్ విజయశ్రీ మాట్లాడుతూ యోగా, ప్రకృతి చికిత్స, యునాని, సిద్ధ, హోమియోపతిల కలయికే ఆయుర్వేదమని చెప్పారు. ఆ తర్వాత దినచర్య, ఆరోగ్య పరిరక్షణ, ఆరోగ్యం ప్రాముఖ్యత, వంటింట్లో వైద్యం, పెరట్లో మందు మొక్కలు, గృహ వైద్యంపై అవగాహన కల్పించి విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, భాగ్య హెల్త్‌క్లబ్ కోఆర్డినేటర్ చెంచురత్నయ్య, సరిత తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ టెంపుల్‌లో నాయకుల పూజలు

కొత్తగూడెంటౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి కాంగ్రెస్ బలపరిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయం సాధించడంతో సోమవారం కొత్తగూడెం గణేశ్ టెంపుల్‌లో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావుతోపాటు పలువురు నాయకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎర్రంశెట్టి ముత్తయ్య, కందుకూరి రాములు, పులి సత్యనారాయణ, దారా చిరంజీవి, పటేటి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరికే కనీసం ఓట్లు !

- మిగతా ఎవరికీ రెండు వేలు కూడా దాటని వైనం
- ఇల్లెందులో 18 మందికి డిపాజిట్లు గల్లంతు
- అన్ని మండలాల్లో పెరిగిన కాంగ్రెస్ ఓటు బ్యాంకు



కోరం కనకయ్య



బానోతు హరిప్రియ

ఇల్లెందు/ఇల్లెందురూరల్: ఇల్లెందు అసెంబ్లీ బరిలో ఇరవై మంది బరిలో నిలవగా ఇద్దరికి తప్ప మిగతా ఎవరికీ రెండు వేలకు మించి ఓట్లు రాలేదు. అలాగే, 18 మంది డిపాజిట్ కోల్పోయారు. అయితే మండలాల వారీగా పరిశీలిస్తే బలాబలాలు ఒకరికి పూర్తిగా తగ్గి, మరొకరికి పెరగటంతో తలరాతలు తారుమారయ్యాయి. ఆది నుంచి ఈ ఎన్నికలను ఎవరికి వారు ప్రతిష్టాత్మకంగా తీసుకోగా బీఆర్ఎస్ పక్షానికి అన్ని మండలాల్లో గణనీయంగా ఓట్లు తగ్గాయి. అదే కాంగ్రెస్‌కు మాత్రం అనూహ్యంగా పెరగడం విశేషం. ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి ఆ పార్టీని దెబ్బకొట్టగా.. ఆరు గ్యారంటీ స్కీంలు కాంగ్రెస్ అభ్యర్థికి కలిసొచ్చాయి.

మండలాల వారీగా ఓట్లు

కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్యకు బయ్యారం మండలంలో 18,401 ఓట్లు, ఇల్లెందులో 37,144 ఓట్లు, టేకులపల్లిలో 18,287 ఓట్లు, గార్లలో 15,776 ఓట్లు, కామేపల్లిలో 17,628 ఓట్లు వచ్చాయి. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియకు బయ్యారంలో 8,539 ఓట్లు, ఇల్లెందులో 14,322 ఓట్లు, టేకులపల్లిలో 13,016 ఓట్లు, గార్లలో 5,849 ఓట్లు, కామేపల్లిలో 9,286 ఓట్లు లభించాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కోరం కనకయ్యకు హరిప్రియ కంటే అదనంగా ఓట్లు రాగా, కనకయ్యకు బయ్యారంలో 9,862 ఓట్ల మెజార్టీ, ఇల్లెందులో 22,822, టేకులపల్లిలో 5,271, గార్లలో 9,927, కామేపల్లిలో 8,342 ఓట్ల మెజార్టీ లభించింది.

గతంతో పోలిస్తే పెరిగిన ఓట్లు

కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్యకు 2018 ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో గణనీయంగా ఓట్లు పెరిగాయి. గత ఎన్నికల్లో ఆయన బీఆర్ఎస్ నుంచి, ఈసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. బయ్యారంలో 6,707 ఓట్లు పెరుగగా ఇల్లెందులో 12,113 ఓట్లు అదనంగా వచ్చాయి. టేకులపల్లిలో 5,700 ఓట్లు, గార్లలో 5,966 ఓట్లు, కామేపల్లిలో 8,892 ఓట్లు పెరిగాయి. అన్ని మండలాల్లో కూడా అధికార పార్టీ అభ్యర్థి బానోతు హరిప్రియకు ఓట్లు తగ్గాయి. బయ్యారంలో గతంతో పోలిస్తే 2,022 ఓట్లు, ఇల్లెందులో 1,307, టేకులపల్లిలో 1,889, గార్లలో 5,966, కామేపల్లిలో 7,383 ఓట్లు తగ్గడం గమనార్హం. ఇదిలా ఉండగా ఎన్డీకి గతంలో 12,878 ఓట్లు రాగా ఈ దఫా 3,091 ఓట్లు, బీజేపీకి 2,394 ఓట్లు పోల్ కాగా, ఈ దఫా 2,568 ఓట్లు వచ్చాయి.

డిపాజిట్ గల్లంతు

ఎన్నికలకు రెండు నెలల ముందు నుంచే బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారం మొదలైంది. అయినా ఓటర్లు తిరస్కరించారు. ఇక బీఆర్ఎస్, కాంగ్రెస్ మినహా మిగతా 18 మంది అభ్యర్థులకు డిపాజిట్ కూడా దక్కలేదు. ఫలితంగా ఈ ఎన్నిక కోరం కనకయ్య, బానోతు హరిప్రియ మధ్యే జరిగినట్లయింది.

27 మంది డిపాజిట్ గల్లంతు

- కొత్తగూడెంలో 'నోటా'కు 1,427 ఓట్లు

సుజాతనగర్: తాజా ఎన్నికల్లో కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో 30 మంది అభ్యర్థులు పోటీ పడగా, అందులో 27 మందికి డిపాజిట్ కూడా దక్కలేదు. నియోజకవర్గంలో 2,43,846 ఓట్లకు గాను 1,86,343 ఓట్లు పోలయ్యాయి. విజయం సాధించిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావుకు 80,336 ఓట్లు రాగా, రెండో స్థానంలో నిలిచిన జలగం వెంకటరావుకు 53,789 ఓట్లు, మూడో స్థానంలో నిలిచిన వనమా వెంకటేశ్వరరావుకు 37,555 ఓట్లు పోలయ్యాయి. మిగిలిన 27 మంది అభ్యర్థులు డిపాజిట్ కోల్పోయారు. కాగా, ఇందులో ముగ్గురు అభ్యర్థులు మాత్రమే నోటా కంటే ఎక్కువ ఓట్లు సాధించడం గమనార్హం. జనసేన అభ్యర్థి లక్కినేని సురేందర్‌రావుకు 1,945 ఓట్లు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి యెర్రా కామేష్‌కు 1,879 ఓట్లు, అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థి తల్లాడ వెంకటేశ్వర్లుకు 1,710 ఓట్లు పోలయ్యాయి. మిగతా 24 మంది అభ్యర్థులు మూడంకెల ఓట్లతోనే సరిపెట్టుకోగా, ఏ ఒక్కరికి వెయ్యికి మించి దాటలేదు. ఇక వీరిందరి కంటే ఎక్కువగా 'నోటా'కు 1,427 ఓట్లు పోల్ కావడం విశేషం.

అభివృద్ధిని కొనసాగించండి

మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ



మాట్లాడుతున్న హరిప్రియ, పక్కన నాయకులు

ఇల్లెందు: ఇల్లెందు నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్ల కాలంలో రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు చేయగా, ఇంకా నిధులు మంజూరైనందున కొత్త ఎమ్మెల్యే అభివృద్ధిని కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ కోరారు. ఇల్లెందులో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన కోరం కనకయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఓడినా వెనుకడుగు వేసేది లేదని, ప్రజల మధ్యే ఉంటానని చెప్పారు. తన హయాంలో అత్యధిక నిధులు సాధించగా, చేపట్టిన పనులతో గ్రామాలు కళకళలాడుతున్నాయని తెలిపారు. ఓటమికి గల కారణాలను గుర్తించి కేసీఆర్ నాయకత్వంలో ముందుకు సాగుతామని వెల్లడించారు. నియోజకవర్గంలో తనకు ఓటు వేసి ప్రజలు, పాటుపడిన నాయకులు, కార్యకర్తలకు హరిప్రియ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ దిండిగాల రాజేందర్, నాయకులు ప్రమోద్‌కుమార్, జేకే శ్రీనివాస్, మౌనిక, రామయ్య, జనగం కోటేశ్వరరావు, పీవీ.కృష్ణారావు పాల్గొన్నారు.

కూనంనేని గెలుపునకు అందరి కృషి

ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు



మాట్లాడుతున్న నాగా సీతారాములు

సుజాతనగర్: కొత్తగూడెం సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయానికి అందరూ కృషి చేశారని, ఇందులో పాలుపంచుకున్న పార్టీల నాయకులతో పాటు ప్రజలకు టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు కృతజ్ఞతలు తెలిపారు. సుజాతనగర్‌లో సోమవారం సంబురాలు నిర్వహించాక ఆయన మాట్లాడారు. కూనంనేని విజయం కోసం సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, టీడీపీ, టీజేఎస్ నాయకులు శక్తి వంచన లేకుండా పనిచేశారని తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్, సీపీఐ నాయకులు చింతలపూడి రాజశేఖర్, భూక్యా దస్రు, జక్కుల రాములు, కొమారి హన్మంతరావు, ముక్కెర మురళి, బాగం మోహన్‌రావు, లోశెట్టి నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు

పాల్వంచ: కాంగ్రెస్ బలపర్చిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలుపులో ప్రజల సహకారం మరువలేనిదని కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు నూకల రంగారావు, కొండం వెంకన్న అన్నారు. పాల్వంచలో సోమవారం వారు మాట్లాడారు.. సీటు కేటాయించిన నాటి నుంచి సహకరించిన నాయకులు, కార్యకర్తలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు తాళ్లూరి సత్యనారాయణ, కట్టా సోమయ్య, బత్తుల వెంకటేశ్వరరావు, ఇమ్మాన్యుయేల్, రాంబాబు, సూర్యకిరణ్, కొండల్‌రావు, శాంతివర్ధన్, రాంబాబు, హుస్సేన్ పాల్గొన్నారు.

అందరి మద్దతుతోనే గెలుపు



సాంబశివరావుకు మిఠాయి తినిపిస్తున్న దృశ్యం



ఎమ్మెల్యే సాంబశివరావుతో ఉద్యమకారులు

సింగరేణి(కొత్తగూడెం): సబ్బండ వర్గాల మద్దతుతోనే తాను ఎమ్మెల్యేగా గెలిచానని, ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. తనపై నమ్మకంతో కొత్తగూడెం అభ్యర్థిగా ప్రకటించినందుకు సీపీఐకి, పొత్తులో భాగంగా మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు, రేవంత్‌రెడ్డి, టీజేఎస్ అధినేత కోదండరామ్, వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల, ప్రజాపంథా, సీపీఎం నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యదర్శి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీనియర్ రాజకీయ నేతలు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, రేణుకాచౌదరితోపాటు మరెందరో నాయకులు ఎన్నికల ప్రచారంలో పాల్గొని తన గెలుపు కోసం కృషి చేశారని వివరించారు. కొత్తగూడెం అభివృద్ధి కోసం, తనను నమ్మిన ప్రజల సంక్షేమం కోసం నిత్యం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

కూనంనేనికి అభినందనలు

కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలుపొందిన కూనంనేని సాంబశివరావును సోమవారం కొత్తగూడెం మున్సిపల్ 10వ వార్డ్ కౌన్సిలర్ మునిగడప పద్మ దంపతులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించే నాయకుడు, ప్రజల సమస్యలను శాసనసభలో ప్రశ్నించే నాయకుడు కూనంనేని అని కొనియాడారు. కార్యక్రమంలో మునిగడప వెంకటేశ్వర్లు, తమ్మ బాబూరావు, అల్లకొండ గోపి, గట్టు చంద్రశేఖర్, పాపారావు, జలీల్, అస్లాం పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఉద్యమకారులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ఎమ్మెల్యేగా ఎన్నికైన కూనంనేని సాంబశివరావును సోమవారం తొలి, మలి దశ ప్రత్యేక తెలంగాణ సమరయోధుల సంఘం నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శాంతిరామ్ మాట్లాడుతూ సాంబశివరావు గెలుపునకు సంఘం ఆధ్వర్యంలో కృషి చేశామని చెప్పారు. అనంతరం సాంబశివరావు.. ఉద్యమకారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చింతలచెర్వు గెర్షోము, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, సారయ్య, కనకయ్య, సత్తార్, సూర్యప్రకాశరావు, గౌతంచంద్‌ఫారూక్, ఎండీ వజీమ్ తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాలకు అనుగుణంగా బోధించాలి

కొత్తగూడెంఅర్బన్: పాఠశాలలో ప్రతి విద్యార్థి సామర్థ్యాలను అంచనా వేస్తూ అందుకు అనుగుణంగా బోధన పద్ధతులు అవలంబించాలని మండల నోడల్ అధికారి ప్రభుదయాల్ తెలిపారు. సోమవారం రామవరం స్కూల్‌ను సందర్శించి పలు సూచనలు చేశారు. విద్యా సామగ్రిని విధిగా ఉపయోగిస్తూ సకల విషయాలను బోధించాలని సూచించారు. బడికి వచ్చే ప్రతి విద్యార్థి నిత్యం అభ్యాసకుడిగా ఉంటూ నిరంతరం నేర్చుకునేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి తరగతిలో తగు బోధన సోపానాలను విధిగా అమలు చేయాలని చెప్పారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా వస్త్రాలు, పలకలు బహూకరించారు. సీఆర్పీ నగేశ్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి మృతికి సంతాపం

జూలూరుపాడు: మండలంలోని గుండెపుడి గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు బానోత్ భీమ్లా సోమవారం మృతి చెందాడు. ఆయన మృతదేహం వద్ద పార్టీ నాయకులు చంద్ర నరేంద్రకుమార్ నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు గుండెపిన్ని వెంకటేశ్వర్లు, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, హలావత్ భద్రు, వల్లమల్ల సామేలు, భోగిన్ని వెంకటేశ్వర్లు, తూము కోటయ్య పాల్గొన్నారు.

పొంగులేటిపై అసత్య ప్రచారం మానుకోవాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంరూరల్: కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై సోషల్ మీడియాలో కొందరు చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని నాయకులు పూణెం శ్రీనివాస్, బండ వెంకటేశ్వర్లు, ఎండీ గౌస్, అయూబ్‌ఖాన్ సూచించారు. చుంచుపల్లి మండలంలోని పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పొంగులేటితో కొన్నేళ్లు ప్రయాణించిన గోపాల్‌రావు.. ఇటీవల వేరే పార్టీ అభ్యర్థి చెంతకు చేరారని తెలిపారు. ఈ విషయంలో పొంగులేటికి సంబంధం లేకున్నా తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. సమావేశంలో వజ్జ భాస్కర్, సత్యనారాయణరెడ్డి, నాగేశ్వరరావు, ధర్మసూద్, ఉపేందర్‌నాయక్, వెంకటరెడ్డి, స్వాతిరెడ్డి, సంపత్, పృథ్వీ, రాము, జీడీ మహే, ఆవుల మధు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు ధన్యవాదాలు



మాట్లాడుతున్న భూక్యా దేవానాయక్

టేకులపల్లి: ఇల్లెందు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్యకు భారీ మెజారిటీ ఇచ్చిన అన్ని వర్గాల ప్రజలకు పార్టీ రుణపడి ఉంటుందని టేకులపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య దేవానాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. దశాబ్దాలుగా ఇల్లెందు గడ్డ కాంగ్రెస్ అడ్డా అని మరోసారి కోరం విజయంతో నిరూపణ అయిందన్నారు. ఆరు గ్యారంటీ పథకాలు అమలు అవుతాయని ఇకపై ప్రజలు కాంగ్రెస్ పాలనలో సంతోషంగా ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బోడ సరిత, భూక్య వెంకటేశ్, రాసమల్ల నర్సయ్య, నర్సింగ్ లక్ష్మయ్య, ఇస్లావత్ రెడ్యానాయక్, మధురెడ్డి, ఈది గణేశ్, బాణోతు భద్రు, మురళి, చందర్, సురేశ్, భద్రు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఎమ్మెల్యేపైనే కోటి ఆశలు



- జూలూరుపాడులో పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- పీహెచ్‌సీ అప్‌గ్రేడ్ కాక అందని మెరుగైన వైద్యం
- బస్‌షెల్టర్, మార్కెట్ యార్డు లేక ప్రజల అవస్థలు



అప్‌గ్రేడ్‌కు నోచుకోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఇన్‌సెట్) బస్‌షెల్టర్ లేక రహదారిపైనే ప్రయాణికులు

జూలూరుపాడు: ఐదేళ్లకోసారి ఎన్నికలు జరుగుతుండడం.. కొత్త ఎమ్మెల్యేలు వస్తుండడం ఆనవాయితీగా మారినా వారు ఇచ్చిన హామీలు నెరవేరకపోగా ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదు. 2009లో చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా వైరా నియోజకవర్గం ఏర్పడింది. జూలూరుపాడు, ఏన్కూరు, వైరా, కొణిజర్ల, కారేపల్లి మండలాలతో ఈ నియోజకవర్గం ఏర్పాటు కాగా, జూలూరుపాడు మండలంలో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఆశించారు. 2009, 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో బానోత్ చంద్రావతి, బానోత్ మదన్‌లాల్, లావుడ్యా రాములునాయక్ ఎన్నిక కాగా, గిరిజనులు, నిరుపేదలు అధికంగా ఉన్న మండలంలో సమస్యలు మాత్రం అలాగే మిగిలిపోయాయి. తాజాగా జరిగిన ఎన్నికల్లో రాందాస్‌నాయక్ గెలుపొందిన నేపథ్యాన ఈసారైనా సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

అప్‌గ్రేడ్ కానీ పీహెచ్‌సీ

మండల కేంద్రంలో 21 ఏళ్ల కిందట పీహెచ్‌సీ ఏర్పాటు కాగా.. 2012 నుంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) అనధికారికంగా నడుస్తోంది. అయితే, దీన్ని వైద్యవిధాన పరిషత్‌లో విలీనం చేయకపోవడంతో అప్‌గ్రేడ్ కాలేదు. సీహెచ్‌సీగా అధికారికంగా అప్‌గ్రేడ్ అయితేనే అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002లో రూ.62 లక్షలతో 30 పడకల ఆస్పత్రి భవనం నిర్మించినా 2007లో ప్రారంభించారు. అయినా వైద్యసేవలు మాత్రం అప్‌గ్రేడ్ కాకపోవడంతో ఏ చిన్న అనారోగ్యం వచ్చినా అటు కొత్తగూడెం లేదంటే ఇటు ఖమ్మం వెళ్లాల్సి వస్తోంది.

కలగానే శాశ్వత మార్కెట్

పత్తి సబ్ మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు లేక రైతులు, హమాలీలు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. ఏన్కూరు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా తాత్కాలిక పత్తి మార్కెట్ యార్డును జూలూరుపాడులో ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేపడుతున్నారు. ఏన్కూరు మార్కెట్‌కు సెస్ రూపంలో రూ.2 కోట్లకు పైగా ఆదాయం వస్తున్నా ప్రైవేట్ స్థలంలో పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారు. ఐదేళ్ల కిందట మార్కెట్ యార్డుకు పది ఎకరాల స్థలాన్ని కేటాయించినప్పటికీ నిర్మాణాలు జరగలేదు. దీంతో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

జూనియర్ కళాశాల ఏర్పాటు ఎప్పుడో?

మండలంలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక గిరిజన ఆశ్రమ పాఠశాల, మూడు ప్రైవేట్ పాఠశాలలున్నాయి. ప్రతీ ఏడాది 400 మందికి పైగా విద్యార్థులు పదో తరగతి పూర్తి చేస్తున్నారు. కానీ, ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు కొత్తగూడెం, ఖమ్మం వెళ్లాల్సి వస్తోంది. అత్యధికంగా గిరిజనులు, నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్న ఈ మండలంలో కొందరు చదువు మానేస్తుండగా, ఇంకొందరు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు.

బస్ షెల్టర్, పబ్లిక్ టాయిలెట్లు

మండల కేంద్రమైన జూలూరుపాడు వ్యాపార సముదాయాలు, గృహ నిర్మాణాలతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. గతంలో ఉన్న బస్ షెల్టర్‌ను రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన అధికారులు మళ్లీ నిర్మించలేదు. దీంతో బస్సుల కోసం ఎండా, వానలో రోడ్డుపైనే వేచి ఉండాల్సి వస్తోంది. అలాగే, పబ్లిక్ టాయిలెట్లు లేక ఇబ్బంది పడుతున్నారు. రెండేళ్ల కిందట బస్‌షెల్టర్, పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని యువజన సంఘం నాయకులు దీక్షకు దిగితే హామీ ఇచ్చిన అధికారులు ఆ తర్వాత మరిచిపోయారు. అలాగే, కొత్తూరు - వినోభానగర్ గ్రామాల మధ్య బీటీ రోడ్డు, సూరారంలో బ్రిడ్జి నిర్మించాలని, కోతుల బెడద నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

పెద్ద ఆస్పత్రిగా మార్చాలి..



ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని పెద్దాస్పత్రిగా మార్చాలి. అప్పుడే డాక్టర్ ఉండి మంచి వైద్యసేవలు అందుతాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నా కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కొత్తగా వచ్చిన ప్రభుత్వమైనా ఆస్పత్రిలో సౌకర్యాలు పెంచితే బాగుంటుంది. తొలుత ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలి.

–లకావత్ బుజ్జి, మాచినేనిపేటతండా

శాశ్వత మార్కెట్ కావాలి



ఏన్కూరు మార్కెట్ కింద జూలూరుపాడు సబ్ మార్కెట్ కొనసాగుతోంది. అద్దె స్థలంలో నిర్వహిస్తుండడం.. షెడ్లు, పట్టాలు లేక వర్షం వస్తే పంటలు నష్టపోతున్నాం. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదు. శాశ్వత మార్కెట్ నిర్మిస్తేనే సమస్య పరిష్కారమవుతుంది. అందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి.

–హలావత్ నర్సింహారావు, రైతు

కళాశాల ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో ఇద్దరు కూతుళ్లను కొత్తగూడెం, పాల్వంచ పంపించాల్సి వస్తోంది. ఇక్కడే కళాశాల నిర్మిస్తే మండలంలోని పిల్లల ఇబ్బందులు తీరుతాయి. ఇక్కడి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి చాలామంది కొత్తగూడెం వెళ్తున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా జూనియర్ కళాశాలను మంజూరు చేయాలి.

–బండ్ల పద్మ, వెంగన్నపాలెం

టీబీజీకేఎస్‌ను ఓడించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): గత నెల 30న జరిగిన సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించినట్లుగానే ఈ నెల 27న సింగరేణిలో జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్ అనుబంధ సంఘమైన టీబీజీకేఎస్‌ను బొందపెట్టాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్ ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లలో పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ఓటమితో సింగరేణికి పట్టిన పీడ విరగడైందని, సంస్థలో రాజకీయ జోక్యం పెరిగి, ఆ ప్రభావం సింగరేణి అధికారుల బదిలీల వరకు వెళ్లిందన్నారు. సంస్థకు రావాల్సిన వేల కోట్ల రూపాయలను వసూలు చేసే వారు లేక సంస్థకు చెందిన అధికారులు కార్మికుల వేతనాల కోసం బ్యాంకుల చుట్టూ పరుగెత్తాల్సిన దుస్థితి నెలకొనడానికి కారణం బీఆర్ఎస్ అని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో మిరియాల రంగయ్య, వంగా వెంకట్, క్రిష్టాఫర్, ఎస్వీ రమణమూర్తి, మల్లికార్జున్, వీరస్వామి, రాములు, గట్టయ్య, సత్యనారాయణ, నాగయ్య, రాంశంకర్, లింగం, హనీఫ్, విక్టర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పోరాడి ఓడుతున్న ఎర్ర జెండాలు

గత ఎన్నికలతో పోలిస్తే తగ్గిన ఓట్లు

ఇల్లెందు: సుదీర్ఘకాలం ఇల్లెందులో ఎర్రజెండా రెపరెపలాడించిన కమ్యూనిస్టు పార్టీలు ప్రాబవం కోల్పోతున్నట్లుగా పలువురు భావిస్తున్నారు. తాజా ఎన్నికల్లో రెండు పార్టీలకు కలిపి 3,091 ఓట్లు లభించడాన్ని ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. ప్రజాపంథా, న్యూడెమోక్రసీ పేరుతో ఆరు దఫాలు ఇక్కడి నుంచి చాపల ఎర్రయ్య, గుమ్మడి నర్సయ్య ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అయితే, 2009లో చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజన సమయంలో ఇల్లెందు ముక్కలు, చెక్కలైంది. ఈ క్రమంలో ఎన్డీలో రాయల వర్గం, చంద్రన్న వర్గాలుగా చీలిక ఏర్పడింది. ఆ తర్వాత వేర్వేరుగా పోటీ చేస్తుండడంతో మరింత బలహీనంగా మారినట్లయింది. 2004లో ఈ పార్టీకి 45,956 ఓట్లు రాగా 2009లో 28,858 ఓట్లు, 2014లో 19,343 ఓట్లు నమోదయ్యాయి. కానీ, 2018 ఎన్నికలకు వచ్చేసరికి 12,878 ఓట్లే వచ్చాయి. ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేసిన మాణిక్యారం సర్పంచ్ మోకాళ్ల కృష్ణకు 1,698 ఓట్లు, ప్రజాపంథా బలపర్చిన గుమ్మడి అనురాధకు 1,393 ఓట్లు మాత్రమే వచ్చాయి. రెండు పార్టీలు కలిపినా 3,091 ఓట్లే రావడం గమనార్హం. ఎన్డీకి పెట్టని కోటగా ఉన్న పల్లెల్లోని బంజారాలు గడిచిన ఎన్నికల్లో హరిప్రియకు, ఈ దఫా కోరం కనకయ్యకు ఓటు వేసినట్లు తెలుస్తోంది.